షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1St Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 3 సంచిక : 107 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 22 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు
VOLUME : 03 ISSUE : 107 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Wednesday 22 April 2026 PAGES : 8 PRICE : 3/-

## ఎన్డీయేతోనే తమిళనాడుకు
# పూర్వ వైభవం




**తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం**
**చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం**
**డీలిమిటేషన్‌పై డీఎంకే, కాంగ్రెస్ తీరును ఎండగట్టిన చంద్రబాబు**
**మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని దక్షిణాదికి నష్టం చేశారని ఆవేదన**
**మాతృభాషను గౌరవిద్దాం.. ఇతర భాషలపై ద్వేషం వద్దని హితవు**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 21)**

అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

2

## ఎంత బెదిరించినా.. తగ్గేదేలే: ఇరాన్



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 21)**

పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన రెండోవిడత చర్చలుజరుగుతాయా, లేదా అనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈక్రమంలో ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో.. వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పేశారు. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనతో పాటు తమ నౌకల రాకపోకలపై దిగ్బంధనం విధించడంతో ట్రంప్ దౌత్య సంబంధాలను దెబ్బతీశారని ఘాలిబఫ్ ఆరోపించారు. టెహ్రాన్ లొంగిపోయేలా ఒత్తిడి చేసేందుకు, యుద్ధం తిరిగి ప్రారంభించడానికి ఈ చర్చలను ఓ సాకుగా చూపేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే బెదిరింపుల మధ్య జరిగే చర్చలను ఇరాన్ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టంచేశారు. గత రెండు వారాలుగా యుద్ధంలో సరికొత్త వ్యూహాల అమలుకు ఇరాన్ ప్రణాళికలు రచిస్తోందని ఆయన హెచ్చరించారు.

**ఇస్లామాబాద్‌కు జేడీ వాన్స్..**

ఇరాన్‌తో చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మరోవైపు ఇరాన్ చర్చల్లో పాల్గొనడంపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. అమెరికా దిగ్బంధనం ఎత్తివేసే వరకు చర్చల్లో పాల్గొనేది లేదని ఇరాన్‌కు చెందిన ఓ వర్గం పేర్కొన్నట్లు తెలుస్తోంది. చర్చల కోసం ఇరాన్ ప్రతినిధి బృందం మంగళవారం ఇస్లామాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతుందని ఆ దేశానికి చెందిన మరో వర్గం వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ▶మిగతా 2లో

## ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది: జగన్

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న జగన్**
**గత రెండేళ్లుగా ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం వెనుకబాటులో ఉందని వెల్లడి**
**ఉపాధి హామీ వ్యయం, పనిచేసిన కుటుంబాల సంఖ్య తగ్గాయని ఆరోపణ**
**అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 21)**

టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ▶మిగతా 2లో

## గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం: అమిత్ షా

**దశాబ్దాల నాటి గోర్కా సమస్యకు పరిష్కారం చూపుతామన్న అమిత్ షా**
**గోర్కా ప్రజల మనోభావాలను అర్థం చేసుకునే పార్టీ బీజేపీయేనని వ్యాఖ్య**
**ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారన్న అమిషా**



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 21)**

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్కా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్కా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు.గోర్కా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ▶మిగతా 2లో

## ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !



**ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు**
**ఒప్పందం కుదిరితే చర్చలకు హాజరుకానున్న ట్రంప్**
**చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ సానుకూల సమీక్ష**
**రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగింపు దశలో చర్చలు**

2

## హత్యలు వీళ్లే చేయిస్తారు.. పరామర్శ వీళ్లే చేస్తారు: మంత్రి పార్థసారధి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 21)**

ప్రజల దృష్టి మళ్లించేందుకు వైకాపా నేతలు ఎన్ని నాటకాలైనా ఆడుతారని మంత్రి పార్థసారథి విమర్శించారు. వివేకా హత్య జరిగిన తర్వాత ఎలా నటించారో అందరం చూశామన్నారు. కడప జిల్లాలో స్థిరాస్తి వ్యాపారి పెద్దదస్తగిరి హత్యపై మంత్రి పార్థసారథి మంగళగిరిలో మీడియాతో మాట్లాడారు.“2019 నుంచి 2024 వరకు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైకాపా ఎలా తెగబడిందో చూశాం. ▶మిగతా 2లో

## మహిళా బిల్లును చంపింది మోదీయే

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 21)**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) బిల్లునే విపక్షం వ్యతిరేకించిందని, ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం మహిళా రిజర్వేషన్ బిల్లును చంపేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుల్ని



వ్యతిరేకించడం ద్వారా విపక్షం 'భ్రూణహత్య'కు పాల్పడిందని ప్రధాని ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. మహిళా కోటాను తాము వ్యతిరేకించలేదని, విపక్షాల పోరాటమంతా డీ లిమిటేషన్ బిల్లుపైనే అని స్పష్టంచేశారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని కూచ్ బిహార్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మహిళా కోటా పేరుతో డీ లిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసేందుకు భాజపా ప్రయత్నించి, చివరకు విఫలమైందని ఎద్దేవా చేశారు. వీగిపోయింది ముమ్మాటికీ ఆ బిల్లేనని చెప్పారు. “నియోజకవర్గాల పునర్విభజనను ముందుకు జరిపి దేశంలో సార్వత్రిక ఎన్నికలను ముందుగానే నిర్వహించాలని మోదీ భావిస్తున్నారు. మీరు (మోదీ) ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు పొడిచారు. మహిళా సాధికారతకు పాటుపడుతున్నట్లు చెప్పుకొంటున్నారు. మహిళా హక్కులు, వారి సంక్షేమం మాకెంతో ప్రాధాన్య అంశం. 2010లోనే రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును యూపీఏ సర్కారు ఆమోదించింది. మోదీ సర్కారు 30 నెలలుగా దానిపై నిద్రపోయి.. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ముందు మేల్కొంది. సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ వంటి మహిళా నేతలు మా పార్టీవారే. భాజపా ఒక్కసారైనా మహిళకు అధ్యక్ష పదవిని ఇచ్చిందా?” అని ప్రశ్నించారు. ▶మిగతా 2లో





## సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ.. ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

**సముద్ర తాబేళ్ల సంరక్షణ కోసం రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు**
**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం**
**చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఛైర్మన్‌గా ఈ కమిటీ**

2

## అభిమానుల సమక్షంలో 'మన చంద్రన్న 2' పుస్తకం విడుదల

**తొలి కాపీని ముఖ్యమంత్రికి అందించిన టీడీ జనార్దన్**
**తెదేపా కేంద్ర కార్యాలయంలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు**



'మన చంద్రన్న 2' పుస్తకం తొలి కాపీని సీఎం చంద్రబాబుకు అందిస్తున్న టీడీ జనార్దన్

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 21)**

చంద్రబాబు జన్మదిన వేడుకల్ని మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలు, అభిమానులతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 76 కిలోల కేక్ కోశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న చంద్రబాబు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శ్రేణులు ఆకాంక్షించారు. చంద్రబాబు భావజాలాన్ని డిజిటల్ రూపంలో తీసుకొచ్చేందుకు రూపొందించిన మన చంద్రన్న యూట్యూబ్ చానెల్‌ను వర్ల రామయ్య ప్రారంభించారు. నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రచించిన 'తెలుగునేల పుణ్యఫలం చంద్రబాబునాయుడు' అనే వీడియో పాటను పార్టీ నేతలు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో విజయాలు, ప్రజా సంక్షేమంపై తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్దన్ రూపొందించిన 'మన చంద్రన్న 2' పుస్తకాన్ని ▶మిగతా 2లో

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

**రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు. "సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?**

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై–బెంగళూరు–అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

**భాషా రాజకీయాలు వద్దు**

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. "మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు. భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు" అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు.

# ఎంత బెదిరించినా.. తగ్గేదేలే: ఇరాన్

ఇక, చర్చలకు వాన్స్ హాజరుకానున్న నేపథ్యంలో.. ఘాలిబఫ్ కూడా ఇందులో పాల్గొనే అవకాశం ఉన్నట్లు అవి వెల్లడించాయి.

**ప్రత్యక్ష చర్చలకు ఓకే: ట్రంప్**

ఇరాన్ నాయకత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ సూచనప్రాయంగా పేర్కొన్నారు. 'వారు కలవాలనుకుంటే.. మా దగ్గర చాలా సమర్థవంతమైన వ్యక్తులు ఉన్నారు. ఒకవేళ నేరుగా నన్నే కలవాలనుకున్నా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు' అని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇక, చర్చల నేపథ్యంలో అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రాయస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించే అవకాశం ఉందన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది: జగన్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా

## మొదటిపేజీ తరువాయి

తగ్గిపోయిందని ఆయన వివరించారు. ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. "టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు" అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం: అమిత్ షా

ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు. అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్కాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 21)

అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు.

**ఇరాన్ హాజరుపై సందిగ్ధత**

అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ, తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, అయితే తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది. ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు అమెరికా వర్గాలను ఉటంకిస్తూ ఏక్సియోస్ నివేదించింది.

**ఇరు దేశాల డిమాండ్లు, హెచ్చరికలు**

ఈ చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు పెద్ద అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు కుప్పకూలకుండా చూసే ఒప్పందం కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇరాన్‌కు అణ్వాయుధాలు అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండకూడదని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు, యుద్ధాన్ని నివారించి, తమపై ఉన్న ఆంక్షలను సడలించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురుచూస్తోంది. కానీ, తమ అణు కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరించుకుంటున్నాయి. తమ షరతులను తిరస్కరిస్తే ఇరాన్‌లోని ప్రతి వంతెనను, పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా, అమెరికా తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని పవర్ స్టేషన్లు, డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ప్రతిస్పందించింది.

**ఇస్లామాబాద్‌లో భారీ ఏర్పాట్లు**

మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఈ కీలక చర్చలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్ వ్యాప్తంగా దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.

# హత్యలు వీళ్లే చేయిస్తారు.. పరామర్శ వీళ్లే చేస్తారు: మంత్రి పార్థసారథి

హత్యలు వీళ్లే చేయిస్తారు.. పరామర్శ వీళ్లే చేస్తారు. ప్రజలను, పోలీసులను తప్పుదోవ పట్టించేలా కారణాలు వెతుకుతారు. పెద్ద దస్తగిరి ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. ఎంపీ అవినాశ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు అతడు. తాడేపల్లి పెద్దలకు కూడా చాలా సన్నిహితుడు. పులివెందులలో జరిగే రహస్య మంతనాల్లో దస్తగిరి ఉంటాడని కడపలో అందరూ చెబుతారు. చీకట్లో చంపేసి.. పొద్దున్నే వెళ్లి పరామర్శ నాటకాలాడుతున్నారు" అని మంత్రి ఆరోపించారు.

# సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ.. ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 21)

మత్స్యకారులు, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలకు కమిటీలో చోటు

ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వీటి పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గతేడాది డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ జీవో ఆర్టీ నెం. 45ను విడుదల చేసింది. ఈ కమిటీకి రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మత్స్యశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు అటవీ శాఖ, కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్, కోస్ట్ గార్డ్ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునేందుకు మెకనైజ్డ్ బోట్ల యజమానుల సంఘం, సంప్రదాయ మత్స్యకార సంఘాల ప్రతినిధులకు కమిటీలో స్థానం కల్పించారు. వీరితో పాటు తాబేళ్ల సంరక్షణలో అనుభవం ఉన్న ట్రీ ఫౌండేషన్, టర్టిల్ యాక్షన్ గ్రూప్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) నుంచి నిపుణులను కూడా సభ్యులుగా నియమించారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు.

# అభిమానుల సమక్షంలో 'మన చంద్రన్న 2' పుస్తకం విడుదల

పల్లా శ్రీనివాస్ ఆవిష్కరించారు. 165 పేజీల ఈ పుస్తకంలో 2024–26 మధ్య అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలు, సంక్షేమం వివరాల్ని చిత్రసహితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, నేతలు నీలాయపాలెం విజయ్‌కుమార్, మన్నవ మోహన్‌కృష్ణ, పీతల సుజాత, నాదెండ్ల బ్రహ్మంచౌదరి, నూకసాని బాలాజీ, ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. మరోవైపు, సీఎం చంద్రబాబును సోమవారం ఆయన నివాసంలో కలిసిన టీడీ జనార్దన్.. 'మన చంద్రన్న 2' పుస్తకం తొలి ప్రతిని అందజేశారు.

# మహిళా బిల్లును చంపింది మోదీయే

**అధికారిక విధుల్ని విస్మరించి బెంగాల్లోనే ఉంటారా?**

చాలా రోజులుగా మోదీ బెంగాల్లో నలుమూలలా తిరుగుతూ తన అధికారిక విధుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఆయన ప్రధానిగా కొనసాగదలచుకున్నారా, లేదంటే బెంగాల్‌కు సీఎం అవుదామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మోదీ చేస్తున్న ఎన్నికల ప్రచారం వల్ల శాంతికి విఘాతం కలిగి, సమాజంలోని భిన్న విశ్వాసాలవారి మధ్య ఉద్రిక్తత తలెత్తుతోందని చెప్పారు. ఇలాంటి ఎత్తుజిత్తులకు ఇంకెక్కడైనా ఫలితం ఉంటుందేమో గానీ బెంగాల్ ప్రజలు మాత్రం పడిపోరని పేర్కొన్నారు. బెంగాల్లో కాంగ్రెస్ పార్టీ కొన్ని పార్టీలతో ఎన్నికల పొత్తులు పెట్టుకుని చాలా నష్టపోయిందని చెప్పారు.


**మోదీ ప్రిజర్వేషన్: కాంగ్రెస్**

దిల్లీ: మహిళలకు రిజర్వేషన్ కల్పించడం కేంద్రం ఉద్దేశం కాదని, ప్రధాని నరేంద్రమోదీ 'ప్రిజర్వేషన్' (పరిరక్షించుకునే) ప్రయత్నమని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగా మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఆ మేరకు బిల్లు తీసుకురావాలని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విజ్ఞప్తి చేశారు. కులగణనను మరుగున పడేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. భాజపా ప్రచారంతో మహిళలు మోసపోయేది లేదని చెప్పారు.

**మహిళల్ని వంచించిన తృణమూల్: భాజపా**

ముర్షిదాబాద్: చట్టసభల్లో 2029 నుంచి 33% మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని వ్యతిరేకించడం ద్వారా మహిళల్ని తృణమూల్ కాంగ్రెస్ వంచించిందని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. ఒకవేళ ఇది మైనారిటీలకు సంబంధించిన అంశమే అయితే మమత అన్నివిధాలా మద్దతు ఇచ్చేవారని చెప్పారు. సోమవారం పశ్చిమబెంగాల్‌లోని తూర్పు మేదినీపుర్‌లో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఆడబిడ్డల భద్రతను గాలికి వదిలేసి చొరబాటుదారుల్ని కాపాడేందుకు తృణమూల్ సర్కారు ఆరాటపడుతోందని, దీనిని ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎంగా మహిళ ఉన్న రాష్ట్రంలోనూ మహిళలకు భద్రత కరవైందని విమర్శించారు. పదవిలో కొనసాగే నైతిక హక్కును మమత కోల్పోయారన్నారు. భాజపా సర్కారు అధికారంలోకి వచ్చి చొరబాటుదారుల్ని తరిమికొడుతుందని, బుజ్జగింపు రాజకీయాలకు తెర దించుతుందని హామీ ఇచ్చారు. సనాతన వ్యతిరేక శక్తులకు దీటైన జవాబు లభిస్తుందన్నారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల విశిష్ట ప్రతిభ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)

జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా స్థాయిలో నందవరపు మణికంఠ (479), సందడి మధు (675), ఎస్కే హఫీజా (1996), కె. రిత్విక్ (6428), పి. దేవ హర్ష (9927) ర్యాంకులు సాధించి విశేష ప్రశంసలు పొందారు. ఈ ర్యాంకులు ప్రకాశం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ చైర్మన్ గోరంట్ల రవికుమార్ , కార్యదర్శి మరియు కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హారిస్థ్ , డీన్ డి. ఆంజనేయులు, నారాయణ, ప్రిన్సిపాళ్లు ఏడుకొండలు , రమేష్ , లక్ష్మీ రెడ్డి, అభినందించారు. వారు విద్యార్థుల కృషి, పట్టుదలను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయానికి నాణ్యమైన బోధన, క్రమశిక్షణ, సమగ్ర శిక్షణ ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో ఈ విద్యాసంవత్సరం నుండి "హొరైజన్ ఐఐటీ మరియు నీట్ అకాడమీ" అనే పేరుతో మరో శిక్షణా సంస్థను ప్రారంభించి, విద్యార్థులకు మరింత ఆధునిక , ఫలితాధారిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల స్థాయిలో శిక్షణను అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అలాగే, అనుభవజ్ఞులైన అధ్యాపకులను ఈ ప్రధాన నగరాల నుండి ఎంపిక చేసి విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకత్వం అందించనున్నట్లు వివరించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకుంది.

# ఘనంగా మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 22)

మండల కేంద్రమైన ఉలవపాడులో మంగళవారం మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభోగంగా పండగ వాతావరణం తలపించేలా మానుగుంట కుటుంబ అభిమానులు అందరూ కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అభిమానులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం వచ్చిన ప్రతి ఒక్కరికి భోజనాలు అందించారు. భోజనం అనంతరం ఉలవపాడు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రజా వైద్యశాల నందు అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ అందించారు. అంతే కాకుండా రోజువారి చూయించుకోవడానికి వెళ్ళిన రోగులకు కూడా పండ్లు, బ్రెడ్, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మానుగుంట మహీధర్ రెడ్డి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.
















ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

22.04.26 బుధవారం


# మార్క్‌ఫెడ్‌లో మహా నిర్లక్ష్యం



### కందులు కొనుగోలు చేసినా రైతుల ఖాతాల్లో పడని నగదు
### నాఫెడ్‌లో అమ్మిన రైతులకు 5 రోజుల్లోనే నగదు జమ
### డబ్బు పడిందనే ఆశతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
### ఇదేం ఖర్మ అంటున్న కంది రైతులు

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 21)**

రైతే రాజు....రైతన్నే దేశానికి వెన్నుముక....రైతు లేనిదే రాజ్యం లేదు...రైతుల కోసం ఎన్నో రాయతీలు ఇస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలకులు రైతులు పండించి అమ్ముకున్న కంది, శనగ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయకుండా మార్క్‌ఫెడ్ అధికారులు అలివిగాని నిర్లక్ష్యాన్ని అవలంబిస్తున్నారు. రైతులు అమ్మిన వాటికి సంబంధించి మార్క్‌ఫెడ్ అధికారులు నగదు ఖాతాల్లో వేశారనే ఆశతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో కంది రైతులు ఇదేం ఖర్మ అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, మార్కెఫెడ్ అధికారులను శాపనార్థాలు పెడుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో కంది పంట భారీగా సాగు చేసి అధిక దిగుబడి పొందారు. ప్రయివేటు వ్యక్తులు రూ.7 వేల నుంచి రూ.7,500 లోపు మాత్రమే



కొనుగోలు చేయడంతో కనిగిరి నియోజకవర్గంలో 2543 మంది కంది రైతులు 58,426 క్వింటాళ్ళ కందులను మార్కెఫెడ్ కు అమ్ముకున్నారు. 1106 మంది శనగ రైతులు 15,067 క్వింటాళ్ళు మార్క్‌ఫెడ్‌కు విక్రయించారు. నెల రోజులు దాటినా రైతుల ఖాతాల్లో కంది, శనగ నగదు జమ కాక ఇదేంటి బాబు అంటూ కందులు, శనగలు పట్టిన మార్క్‌ఫెడ్ దళారులను, సొసైటీ అధికారులను అడుగుతూ ఉన్నారు. కానీ రైతులకు కాలయాపన సమాధానమే చెబుతున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన నాఫెడ్ ద్వారా కందులు, శనగలు అమ్మకం చేసిన రైతులకు 5 రోజుల్లోనే నగదు జమ అయ్యింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 5 నాఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. నాఫెడ్ లో అమ్ముకున్న రైతులకు 5 రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమయ్యింది.

నాఫెడ్ రైతులకు నగదు జమఅయి, మార్క్‌ఫెడ్ కు అమ్మిన రైతులకు నగదు జమ కాకపోవడంతో అప్పు ఉన్న వారికి రైతులు సమాధానం చెప్పుకోలేక సతమత మవుతున్నారు. మార్క్‌ఫెడ్‌కు అమ్ముకుని ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రయివేటుగా, నాఫెడ్ కు అమ్మిన రైతులకు నగదు చేతికిరావడంతో వారు ఆనందంగా ఉండగా మార్క్‌ఫెడ్ నిర్లక్ష్యంతో వేల మంది రైతులు నగదు వారి ఖాతాల్లో జమ గాక ఆ రైతులు (తరువాయి 4లో...)

## జల కళ ను సంతరింపజేయడమే అధికారులు లక్ష్యం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల, జిల్లా కలెక్టర్ విజయ సునీత





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 21)**

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం నియోజకవర్గంలో జల కళ ను సంతరింప చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. మంగళ వారం మార్కాపురం కలెక్టరేట్లో జల ధార - జల హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గంలోని 102 చెరువులను బాగు చేసి వాటిని వచ్చే వర్షాకాలం లో నీటితో నింపేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్, డ్వామా, వీబీజీ రాంజీ పథకం సిబ్బంది సహకారంతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దాతల సహకారంతో కొన్ని (తరువాయి 4లో...)

# ప్రతి రోజూ ఒక పాఠశాలలో అధికారులు భోజనం చేయాలి


### తల్లికి వందనం పడిందో లేదో డీఈఓ బాధ్యత తీసుకోవాలి
### విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తే కూటమి ధ్యేయం
### అద్దంకిలో విద్యార్థులకు 11,044 ఉచిత సైకిళ్ల పంపిణీ
### విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీలో
### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి







**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 21)**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటుకు ధీటుగా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తును అందించడమే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంత్రి గొట్టిపాటి మంగళవారం అద్దంకి నియోజవర్గంలో పర్యటించారు. ముందుగా సంతమాగులూరు మండలం కొప్పరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 72 మంది విద్యార్థులకు ఆసిస్ట్ స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఉచితంగా సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి విద్యార్థులతో ఇష్టాగోష్ఠి సంభాషించారు. ఇప్పటి వరకు అద్దంకి నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 11,044 సైకిళ్లన పంపిణీ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. దీనికి ఎందరో దాతలు సహకరించారన్న మంత్రి గొట్టిపాటి మంచి పని చేయడానికి (తరువాయి 4లో...)






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

అసలోడి కన్నా కోసరోడు మేలు అన్నట్లు ఉన్నది ఇప్పుడు భూ యజమానులు పరిస్థితి సంతనూతలపాడు మండలం పేర్ణమిట్ట లో జరిగిన ఓ భూ నకిలీ పత్రం వ్యవహారం ఇందుకు ఉదాహరణగా మారింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పేర్ణమిట్ట సర్వే నంబర్ 452/19 లో వారి పూర్వీకుల ద్వారా సంక్రమించి అన్ని అధికారిక ధ్రువీకరణ పత్రాలతో పాటు సర్వే చేసిన నివేధికలతో లతో అనుభవంలో ఉండగా ఎర్రగుడిపాడు కి చెందిన పెనుబాకు వరమ్మ ఆమె కూతరు సునీత అల్లుడు పాలేటి అజయ్ అనువారు ఆ భూమి తమదని అనేక మార్లు పొంతన లేని సమాధానాలు చెప్తూ సంతనూతల పాడు ఎమ్మార్వో మరియు పోలీసు స్టేషన్ లలో ఫిర్యాదులు ఇస్తూ వచ్చారు. వారు ఫిర్యాదులు ఇచ్చిన ప్రతీ సారి విచారించిన అదికారులు వారి వద్ద ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేవని కాగా వరమ్మ అనువారు స్థానికులు కాదని గత 40 సంవత్సరములుగా చీమకుర్తి ఎర్రగుడిపాడు ఉంటున్నారని బాధితుడు అన్ని ధ్రువీకరణ పత్రాలతో అనుభవంలో ఉన్నారని నిర్ధారిస్తూ

## అంగట్లో అమ్మకానికి నకిలీ పట్టాలు

- నిశానీలకు సైతం బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో నకిలీ పట్టాలు
- చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు
- మండల రెవిన్యూ రికార్డులలో నమోదు లేని నకిలీ పట్టా తెచ్చి అసలు భూ యజమానిని రెండు సంవత్సరాలుగా ఇబ్బంది పెట్టిన నకిలీ భూ యజమానులు
- ఇదే విషయమై స్పందన పీజీఆర్ఎస్‌కు విన్నవించుకున్న భాధితుడు
- పీజీఆర్ఎస్ విచారణలో ఆ పట్టా సంతనూతలపాడు రెవిన్యూ రికార్డ్‌లో లేదని స్పష్టత ఇచ్చిన అధికారులు
- అదే నకిలీ పట్టాని గతంలో దర్జాగా పీజీఆర్ఎస్ ద్వారా ఆ భూమి తమదని ధైర్యంగా ఫిర్యాదు చేసిన నకిలీ భూ యజమాని
- ఈ నకిలీ పట్టా వెనుక ఓ టీడీపీ నాయకుడు, ఓ ఇంటెలిజెన్స్ కి సంబంధించి కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని బాధితుడి ఆవేదన

# బిజెపి నిజంగానే పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టిందా

## మహిళా బిల్లు ముసుగులో బిజెపి ప్రవేశపెట్టింది డీలిమిటేషన్ బిల్లు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 21)**

పార్లమెంటులో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది మహిళా బిల్లెనా అని, 2023 లో పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళ బిల్లును తిరిగి ఎలా ప్రవేశపెడతారని, కేవలం ఐదు రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలలో ఓట్లు రాబట్టుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని (తరువాయి 4లో...)

- 2023లో పాస్ అయిన మహిళా బిల్లు 2034 నుండి అమల్లోకి వస్తుంది
- దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి
- ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిజెపి కొత్త డ్రామాకి తెర
- మహిళా వ్యతిరేకి బిజెపి
- డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- బిజెపికి మహిళల పై గౌరవం ఉంటే ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాలలో 33% వంతున సీట్లు ఇవ్వాలి
- బిజెపి తరపున తమిళనాడు ఎన్నికలలో చంద్రబాబు ప్రచారం చేయటానికి సిగ్గుపడాలి
- అమరావతిలో మూడో విడత భూ సేకరణకు సీపీఐ వ్యతిరేకం
- 30 సంవత్సరాల కాలంగా దొనకొండలో ఎందుకు పారిశ్రామిక అభివృద్ధి చేపట్టలేదు
- మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఫైర్

## మరోసారి హాట్ టాపిక్‌గా టోల్ ప్లాజా పేరు వివాదం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 21)
దోర్నాల మండలంలో టోల్ ప్లాజా పేరు వివాదం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న టోల్ ప్లాజా పేరుపై గతంలో హసనాబాద్, జమ్మి దోర్నాల గ్రామస్థుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాలు రోడ్డెక్కి ఆందోళనలకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొని, ఒకరిపై ఒకరు తోపులాటకు దిగిన ఘటన కూడా చోటుచేసుకుంది. ఆ సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా ఈ వివాదంపై హసనాబాద్ గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా హైకోర్టు ఈ వ్యవహారంపై స్టే విధించింది. రెండు వారాల్లోగా పేరు వివాదాన్ని పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. అంతవరకు టోల్ ప్లాజా పేరుకు సంబంధించిన అన్ని పనులను నిలిపివేయాలని స్పష్టం చేసింది. హైకోర్టు స్టేతో హసనాబాద్ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామం పేరు టోల్ ప్లాజాకు పెట్టాలని కోరుతూ ఈరోజు మీడియా సమావేశం నిర్వహించి అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. టోల్ ప్లాజా కోసం ఎంతో విలువైన భూములను తక్కువ ధరలకే ఇచ్చామని, తమ గ్రామం పేరు పెట్టేందుకు అధికారులు సహకరించాలని హసనాబాద్ గ్రామస్తులు కోరుతున్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముక్కు, ఇంటూరి







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 21)
కందుకూరు పట్టణంలో దివి రవీంద్రనాథ్ గృహప్రవేశ వేడుకకు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రూరల్ మాజీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు హాజరయ్యారు.

## మార్క్‌ఫెడ్‌లో మహా నిర్లక్ష్యం



పడే బాధలు వర్ణణాతీతం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మార్క్‌ఫెడ్‌కు కందులు, శనగలు అమ్ముకున్న రైతుల ఖాతాల్లో వెంటనే నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మార్క్‌ఫెడ్‌కు కందులు, శనగలు అమ్ముకున్న రైతుల ఖాతాల్లో నగదు జమకాని విషయమై మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణను వెలుగు ప్రతినిధి ప్రశ్నించగా ఈ వారంలో పడతాయంటూ సమాధానం చెప్పడం గమనార్హం.

## జల కళ ను సంతరింపజేయడమే అధికారుల లక్ష్యం

పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచాలన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మార్కాపురం ప్రాంతంలో నీటి సమస్య రాకుండా ఉండాలంటే ఈ పథకాన్ని సమగ్రంగా ఉపయోగించుకోవడం ఒక్కటే మార్గం అని తెలిపారు. చెరువులు, కాలువలు, సప్లై ఛానల్ లలో చిల్లకంప ఎక్కువగా ఉందని దాన్ని గ్రామస్తులు, మరి కొంతమంది దాతలు సహకారంతో తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిరోజు రివ్యూ చేస్తున్నారని వివరించారు. దానికి అనుగుణంగా అధికారులు పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ అబూతలిం, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రోజూ ఒక పాఠశాలలో అధికారులు భోజనం చేయాలి

అందరూ ముందుకు వస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందన్న ప్రశ్నకు విద్యార్థులు బావుందని మంత్రి గొట్టిపాటికి సమాధానం చెప్పారు. మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక పాఠశాలలో అధికారులు మధ్యాహ్న భోజనం చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఈ విషయాన్ని ఇంతకు ముందే చెప్పినా ఎందుకు పాటించడం లేదని ఆయన ప్రశ్నించారు. తల్లిదండ్రులు కూడా మధ్యాహ్న భోజనం చేస్తూ పాఠశాల భోజనాల నాణ్యతను పరిశీలించాలన్నారు.

**అధికారులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి....**

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ఉందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. గతంలో ఒక్కో స్కూలుకు ఒకే టీచర్ ఉన్న పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని డిఎస్సీ ద్వారా ఒకేసారి 16,00కుపైగా టీచర్ పోస్టులను భర్తీ చేశారన్నారు. నాణ్యమైన బ్యాగు, యూనిఫాం, షూలతో పాటు చదివే అందరికీ తల్లికి వందనం అందజేస్తున్నామన్నారు. తల్లికి వందనం నగదు లబ్ధిదారులకు అందుతుందో లేదో చూడాలని, అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత డీఈఓ, ఎంఈవో, ఇతర అధికారులదే అని మంత్రి గొట్టిపాటి తేల్చి చెప్పారు. కొప్పరం పాఠశాలకు త్వరలోనే డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలక కాంపౌండ్ వాల్ కు రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయని, ప్రహరీ గోడ నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. పాఠశాలలో కార్యక్రమం పూర్తి అయిన తరువాత మంత్రి గొట్టిపాటి గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులకు అందించిన ఆయన., వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కొప్పారం గ్రామంలోని మసీదును మంత్రి గొట్టిపాటి సందర్శించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నేతలు మంత్రి గొట్టిపాటిని సన్మానించారు.బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల పక్షపాతి అయిన కూటమి ప్రభుత్వంలోనే అందరికీ రక్షణ ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**కొమ్మాలపాడులో కాపు కమ్యూనిటీ భవనం ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి**

అద్దంకి నియోజకవర్గం, సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడులో రూ.50 లక్షలతో నిర్మించిన కాపు కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం నాడు మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ., నియోజకవర్గంలో దాతల సహాయంతో నియోజకవర్గం మొత్తం మీద సుమారు 30 కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నామన్నారు. కొమ్మాలపాడులోనే ఇప్పటి వరకు సుమారు రూ.1.20 కోట్లతో వివిధ అభివృద్ధి



పనులు చేపట్టామని ఆయన వెల్లడించారు. మండలంలో ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే ఏల్చూరు దగ్గర 11 ఎకరాల్లో 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. పెండింగ్ లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను, సంక్షేమ, అభివృద్ధి బాటలో దూసుకుపోతున్న కూటమి పాలనలో తేడాను ప్రజలే గమనించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## బిజెపి నిజంగానే పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టిందా
## మహిళా బిల్లు ముసుగులో బిజెపి ప్రవేశపెట్టింది డీలిమిటేషన్ బిల్లు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఫైర్ అయ్యారు. ఏపీ ప్రజానాట్యమండలి కోస్తా జిల్లాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు ఒంగోలులో ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాటిల్లో పాల్గొనేందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం ఒంగోలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ మహిళా బిల్లు ముసుగులో డీ లిమిటేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదం పొందేందుకు బిజెపి కుట్ర చేసిందన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు సందేహాలపై, ఒక గంట వ్యవధిస్తే మార్పులు చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మోసపూరితంగానే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. మహిళా బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే అది తమ విజయం గా ప్రచారం చేసుకునేందుకు సన్నద్ధమైందన్నారు. బిల్లు వీగిపోతే ఆ నెపాన్ని ఇండియా బ్లాక్ పై వేసి, మొసలి కన్నీరు కార్చేందుకు పక్కా పథకాన్ని రచించిందన్నారు. పార్లమెంటులో ది లిమిటేషన్ బిల్లు వీగిపోవటంతో ఇప్పుడు ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షాలు దేశంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు బిజెపి నోరు మెదపలేదన్నారు. బిజెపి ఎంపీ ఒక మహిళా రెజ్లర్ అనుచితంగా ప్రవర్తించినప్పుడు బిజెపి నోరు ఎత్తలేదన్నారు. ఒక దళిత మహిళపై దారుణంగా అత్యాచారం జరిగినప్పుడు బిజెపి నోలెత్తలేదన్నారు. బిజెపి మూల గ్రంథమైన మను సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ఎల్లప్పుడూ మహిళల పట్ల చిన్న చూపు చూస్తూనే ఉన్నారన్నారు. అటువంటి బిజెపి నేడు మహిళలంటే తమకు ఎంతో గౌరవం అన్నట్లు శుద్ధ పూస పలుకులు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023లో పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లు 2034 తర్వాత అమలులోకి వస్తుందని నారీ శక్తి వందన్ పేరుతో బిజెపి సంబరాలు చేసుకున్న విషయాన్ని బిజెపి నేతలు మరిచినా, దేశ ప్రజలు మరువలేదని గుర్తు చేశారు. డీ లిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దేశంలో విపరీతంగా పెరుగుతున్న జనాభా పెట్టుకొని నాటి ప్రధానులు ఇందిరాగాంధీ, వాజ్ పాయి లు దాదాపు 50 సంవత్సరాలు పాటు జనగణన జరగనివ్వలేదన్నారు. ప్రధాన మంత్రుల మాటలు విని దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఒకరు లేదా, ఇద్దరూ నినాదాన్ని అమలులోకి తీసుకొచ్చి జనాభా పెరగకుండా అదుపులోకి తీసుకువచ్చారన్నారు. అయితే ఉత్తరాది రాష్ట్రానికి ప్రజలు దానిని అమలు చేయకుండా గణనీయంగా జనాభా ను పెంచుకున్నారు అన్నారు. డీలిమిటేషన్ అమల్లోకి వస్తే దక్షిణాది రాష్ట్రాల కన్నా, ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ నిధుల వాటా ఎక్కువగా పోతుందన్నారు. అందువల్లే ఇండియా బ్లాక్ పార్టీలు ఈ బిల్లును అడ్డుకున్నాయన్నారు. బిజెపి మాటలను మూర్ఖంగా రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, వైసీపీలో అమలు చేసేందుకు సిద్ధమవటం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. దానికి తోడు చంద్రబాబు నాయుడు బిజెపి పక్షాన తమిళనాడులో ప్రచారానికి వెళ్ళటం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చల విడిగా పెరిగిపోయింది అన్నారు. రేషన్, భూ మాఫియాలు అధికార పార్టీ నాయకుల చేతుల్లోనే ఉందన్నారు. చివరికి మెడికల్ కళాశాలలకు ఇచ్చిన భూములను కూడా అధికార పార్టీ నాయకులు వదలటం లేదన్నారు. రాష్ట్రంలో భూములను వ్యవసాయ భూములుగా కాకుండా, వ్యాపార వస్తువుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులను, వ్యవసాయాన్ని నిండా ముంచారన్నారు. అమరావతిలో మూడో విడత భూ సేకరణకు సిపిఐ వ్యతిరేకమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కూడా శూన్యమన్నారు. 30 సంవత్సరాలుగా దొనకొండ పారిశ్రామిక కారిడార్ లో అధికార పార్టీలు చేసింది ఏమీ లేదన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, రైతులకు, ప్రజలకు అరిచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి అంటే వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడమే అన్నారు.

అయితే రాష్ట్రంలో ఇవి రెండూ అభివృద్ధి జరగటం లేదన్నారు. రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధరలు తగ్గటం లేదన్నారు. చంద్రబాబు నాయుడుకు అభివృద్ధి అంటే పోలవరం, అమరావతి అభివృద్ధి అన్న తీరుగా పాలన సాగిస్తున్నారన్నారు. పోలవరం ఎత్తు తగ్గించమని నిర్మాణం చేస్తూ, అమరావతి కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన నగరంగా అభివృద్ధి చేస్తున్నారని ఈపాటికి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం సాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను చేస్తున్న మోసాన్ని బయటపెడుతూ ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రానున్న కాలంలో ప్రచారాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే పోస్టల్ జిల్లాల ఏపీ ప్రజానాట్యమండలి కళాకారుల సమావేశం ఒంగోలులో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## సూర్య అగ్ని సోలార్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అన్నా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 21)
పొదిలి పట్టణం నందు దుగ్గెంపుడి శ్రీనివాసరెడ్డి నూతనంగా ప్రారంభించిన సూర్య అగ్ని సోలార్ షోరూం నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి ఈ వ్యాపారంలో దినదినాభివ ద్ధిసాధించాలని కోరారు. తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తాతా సత్యం, యక్కలి శేషగిరిరావు, గొలమారి చెన్నారెడ్డి, మందలపు శ్రీనివాసరెడ్డి, ఎస్ వెంకటేశ్వరరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## అంగట్లో అమ్మకానికి నకిలీ పట్టాలు

ఎండార్స్మెంట్ ఇవ్వగా ఇలా కుదరడం లేదని భావించిన వరమ్మ ఆమె కూతురు అల్లుడు డీకేటీ నెం. 16/1404, 26/10/2003 న జారీ చేసినట్లు ఓ నకిలీ పట్టాని బహిరంగ మార్కెట్‌లో తయారు చేయించి ఇదే పట్టాని పీజీఆర్ఎస్ 20240809193 ద్వారా సమర్పించి స్పందనలో ఫిర్యాదు చేయగా అప్పుడు విచారించిన అదికారులు వరమ్మ అనువారి వద్ద సరైన పత్రాలు లేవని భాదితుడు అనుభవంలో ఉన్నాడని ఎండార్స్మెంట్ ఇచ్చియున్నారు.అయితే వరమ్మ అనువారు సమర్పించిన నకిలీ పట్టా విషయమై విచారణ చేపట్టాలని బాధితుడు పీజీఆర్ఎస్ పీఆర్ఏ 20251007889 ద్వారా కోరగా విచారణ చేపట్టిన సంతనూతలపాడు రెవిన్యూ అధికారులు పెనుబాకు వరమ్మ సమర్పించిన డీకేటీ నెం.16/1404, 26/10/2003 పట్టా సంతనూతలపాడు రెవిన్యూ రికార్డ్ లలో నందు నమోదు అవ్వలేదని కానీ ఇదే పట్టాని ఆమె స్పందన ఫిర్యాదులో సమర్పించారని ధ్రువీకరిస్తూ ఎండార్స్మెంట్ ఇచ్చియున్నారు. కానీ నకిలీ పట్టా సృష్టించి ప్రభుత్వ అధికారుల సమయం వృధా చేయడంతో పాటు అసలు భూ యజమానిని బెదిరించి నేరానికి పాల్పడిన వరమ్మ ఆమె కూతురు సునీత అల్లుడు అజయ్ లపై క్రిమినల్ కేస్ నమోదు చేసి విచారణ చేపట్టాలని భాదితుడు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోగా నువ్వే క్రిమినల్ కేస్ పెట్టుకో అని సలహా ఇచ్చారని బాధితుడు వాపోయాడు. ఈ నకిలీ పట్టా వ్యవహారంలో సంతనూతలపాడుకి చెందిన ఓ టీడీపీ నాయకుడు, అదే మండలంలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఉన్నారని, వీరిరువురు వరమ్మ బంధువు అవ్వడం వల్ల విచారణ చేపట్టడం లేదన్నారు. ఈ నకిలీ పట్టా విషయంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నకిలీ పట్టాలు దర్జాగా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నా ముఠా ఆగడాలు బయటపడుతాయని బాధితుతు ఆవేదన వ్యక్తం చేశాడు.

# పెండింగ్‌లో ఉన్న మార్చి నెల జీతం చెల్లించాలి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పెండింగ్లో ఉన్న మార్చి నెల జీతం చెల్లించాలని, ఆప్కాస్ కొనసాగించాలని, నిధి పోర్టల్ యాప్ రద్దు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు పెంచాలని, చనిపోయిన కార్మికులు వాళ్ళ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కోవిడ్ కార్మికులకు 21 వేతనం ఇవ్వాలని, ఆప్కాస్‌లోకి తీసుకోవాలని, ఒంగోలు మున్సిపల్ కార్మికులకు నాలుగు సార్లు మస్టర్ విధానాన్ని ఆపాలని తదితర డిమాండ్లతో ఒంగోలు నగరంలో పారిశుద్ధ్య కార్మికులు మెరుపు సమ్మె చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం. కలెక్టర్ ఆఫీస్ వద్దకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు నగర సమన్వయ కన్వీనర్ మహేష్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని, మీరే దేవుళ్ళు అని పొగిడిన ఓటమి ప్రభుత్వం గత ఆరు సంవత్సరముల నుండి ప్రతి నెలా ఒకటో తేదీన కార్మికుల ఖాతాలో జీతాలు జమవుతున్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ స్థానంలో నిధి పోర్టల్ యాప్‌ను తీసుకొచ్చి ఆప్కాస్ నిలిపివేయడం జరిగింది. మీకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానంటే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. అలాకాకుండా కొందరి కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం ఈ చర్యకు పూనుకుంటుందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రికి, మున్సిపల్ ఉన్నతాధికారులకు విన్నవించుకున్న కార్మికులు రోడ్డు ఎక్కేంతవరకు సమస్య పరిష్కారం చేయలేదన్నారు. అలాగే కోవిడ్ కార్మికుల జీతాలు కూడా వెంటనే చెల్లించాలి. వాళ్లకు కూడా రూ. 21వేలు వేతనం చెల్లించాలన్నారు. అలాగే రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, చనిపోయిన కార్మికులు, ఆరోగ్యం బాగా లేని కార్మికుల స్థానంలో వాళ్ల కుటుంబ సభ్యుల్ని విధుల్లోకి తీసుకోవాలని, అలాగే ఒంగోలు నగరంలో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మున్సిపల్ కార్మికులకు నాలుగు సార్లు మస్టర్ వేసే విధానాన్ని వెంటనే ఆపాలన్నారు. స్థానికంగా అనేక సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకుంటే ఒంగోలు నగరంలో మున్సిపల్ కార్మికులు దశల వారి పోరాటానికి సిద్ధమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి నరసింహం, టీ విజయమ్మ, కే సామ్రాజ్యం, యు కుమారి, వై రవి, కే మోహన్‌రావు, కే సాల్మన్, కే ఆనంద్, బి ప్రవీణ్, మనోరంజని, లక్ష్మీకాంతం, భారతి, దివ్య, వంశి, కమల, ఆర్ రాములు, ఎం బాబు, జేమ్స్, చిన్నబ్బాయి, సునీత, కే వెంకటేశ్వర్లు, బయ్యవరపు కోటేశ్వరరావు, టి పిచ్చయ్య, రాఘవులు, కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో టిడిపి కార్యకర్త నాగరాజు మృతి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 21)

మండలంలోని వీరభద్రపురంలో మేకల నాగరాజు (22) అనే టిడిపి కార్యకర్త మేకల మేత కొరకు సుబాబుల్ చెట్టు ఎక్కి కొమ్మలను కొడుతుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ లైన్ తీగలకు కొమ్మలకు తగలడంతో షాక్‌కు గురై అతను చెట్టు పైనే మృతి చెందాడు. వీరభద్రపురం గ్రామ టిడిపి అధ్యక్షుడు అయిన మేకల శ్రీను అన్న కొడుకు మృతుడు నాగరాజు.

## ప్యాకెట్ ఫుడ్ వద్దు... ఇంటిఫుడ్ ముద్దు

### ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 21)

మండలంలోని కంచర్ల వారి పల్లి అంగన్వాడీ కేంద్రం నందు "8వ పోషణ పక్వాడ -2026 వేడుకలు" ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం విఎస్ పార్వతి అధ్యక్షతన జరిగినవి. ముఖ్య అతిథిగా టాటా ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ డి గోపి హాజరై, గర్భధారణ దశ నుండి మొదటి 1000 రోజులు స్వర్ణమ దశని, ఆరోగ్యవంతమైన తల్లి, శిశువు కొరకు తీసుకోవలసిన పోషకాహారం, జాగ్రత్తలను గురించి, సెల్ ఫోన్, టీవీ లకు పిల్లలను దూరంగా ఉండేలా చూడాలని, తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు పిల్లలకు కథలు, ఆటల ద్వారా సమయాన్ని గడిపేలా చూడాలన్నారు. సూపర్వైజర్ పార్వతి మాట్లాడుతూ జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను, సాంప్రదాయ ఇంటి పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కలిగించిరి. "పాఠశాల సంసిద్ధత" అంటే 3 సంవత్సరముల పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య కొరకు అంగన్వాడీ కేంద్రంలో చేరి, ఆట ఆధారిత విద్యను పొందుట ద్వారా శారీరక, మానసిక, భావోద్వేగ, జ్ఞానాత్మక నైపుణ్యాలను పెంపొందించుకుంటారని అన్నారు. 3-6 సం.ల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రానికి పంపిస్తామని ,జంక్ ఫుడ్ వద్దు -ఆరోగ్యమే ముద్దు, ప్యాకెట్ ఫుడ్ వద్దు -ఇంటి ఫుడ్డే ముద్దు అని ప్రమాణం చేసిరి. తదుపరి గ్రామంలో పోషణ పక్వాడ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శాంతి కుమారి, కళ్యాణి, శైలజ, భాగ్యలక్ష్మి, సరస్వతి, ధనమ్మ, సుజాత, షర్మిల, జ్యోతి, ధనలక్ష్మి, గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## జెఈఈ మెయిన్స్‌లో అద్భుతాలు సృష్టించిన ఎస్ఎస్ఎన్ విద్యార్థులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)

సోమవారం సాయంత్రం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ 2026 మొదటి ఫలితాలలో ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. స్థానిక మంగమూరు రోడ్డు లోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాలలో జెఈఈ మెయిన్స్ ప్రారంభించిన మొదటి బ్యాచ్ లో బి స్రవంత్ అశోక్ ఓపెన్ క్యాటగిరి లో 97.28 పర్సంటైల్, మరో విద్యార్థి ఆర్ రాముడు ఆల్ ఇండియా స్థాయిలో 4510 ర్యాంకును సాధించి ప్రకాశం జిల్లాకు గర్వకారణంగా నిలిచారని ఎస్ఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ ఎల్లటూరి రామకృష్ణారెడ్డి ఓ ప్రకటన విడుదల చేసారు. అలాగే మరో ఐదుగురు విద్యార్థులు 90 పర్సంటైల్ పైన సాధించినట్లు పేర్కొన్నారు. రాసిన 40 మందిలో 22 మంది జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాదించారని అన్నారు. రానున్న కాలంలో అత్యుత్తమ ఫలితాలు పొందేదిశగా ప్రత్యేక దృష్టి పెడుతున్నామని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుండి జేఈఈ మెయిన్స్ పరీక్షల నిమిత్తం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ వై శివానందరెడ్డి, డీన్ జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రఘునాథ్‌రెడ్డి, మధు, చెంచిరెడ్డి, రాజేష్, అధ్యాపక, అధ్యాపకేతరులు అభినందించారు.

## ఎస్టీ కాలనీలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)

మండలంలోని కరేడు సెక్టార్ పరిధిలో మర్రిచెట్టు సంఘం ఎస్టీ కాలనీలో మంగళవారం సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 23 వరకు 3-6 సంవత్సరాల ప్రారంభ విద్య, ఎదుగుదల, మెదడు అభివృద్ధి, పాఠశాల సంసిద్ధత అనే అంశాల పై గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## పోషన్ పక్వాడ పై అవగాహన కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)




ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని గుడ్లూరు సెక్టార్ 1 గుడ్లూరు ఎస్టి అంగన్వాడి సెంటర్ నందు మంగళవారం సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు, బాలింతలు, ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ పక్వాడ గురించి తెలియపరచడం జరిగింది. చిన్నపిల్లల మానసిక వికాసానికి అడ్డంగా మారుతున్న సెల్ ఫోన్లు. టీవీలకు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. అలాగే రోజు వారి ఆహారపు అలవాటుగా మారుతున్న జంక్ ఫుడ్ తీసుకోవడం వలన పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాల పై అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్లు టీవీలు చూడటం వలన వారి మానసిక వికాసం దెబ్బతింటుందని, తద్వారా ఆలోచన శక్తి, తెలివితేటలు, సృజనాత్మకత, మందగిస్తుందని, అలాగే మరి కొంతమందిలో మాటలు రాకపోవడం, చూపు మందగించడం, ఊహాశక్తి లోపించటం, తదితర సమస్యలు తలెత్తుతాయని బుల్లితెరకు చిన్నపిల్లలను దూరంగా ఉంచేందుకు చక్కటి కథలు, ఆటపాటల ద్వారా భాష నైపుణ్యాలు ఆరుబయట ఆటలను ఆడించడం సంస్కృతి సాంప్రదాయాల పై అవగాహన కల్పించడం వంటివి చేయాలని అంగనవాడీ కార్యకర్తలకు గర్భవతులకు, బాలింతలకు సూచించారు. ఇటీవల కాలంలో జంక్ ఆహారం వినియోగించడం పెరిగిందని, ముఖ్యంగా బాలింతలు, గర్భవతులు ఈ ఆహారం తీసుకోవడం వలన మధుమేహం, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, ఎక్కువగా తలెత్తుతున్నాయని, పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ, ప్రకృతి సహజ సిద్ధమైన చిరుధాన్యాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తీసుకునేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 21)



గిద్దలూరు నియోజకవర్గాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అన్ని శాఖలు అధికారుల పై ఉందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మంగళవారం గిద్దలూరు పట్టణంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల ధార-జలహారతి కార్యక్రమ పనులను వేగవతం చేయాలన్నారు. త్వరిత గతిన పనులను గుర్తించి నియోజకవర్గంలోని 176 చెరువులను జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను పూర్తి చేసి వర్షాకాలం నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. అదే విధంగా రెవెన్యూ సమస్యలు ఇక్కడ అధికంగా ఉన్నాయని, మ్యూటేషన్స్ సరిగా జరగడం లేదన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని తహసిల్దార్లు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి నియోజకవర్గంలోని ఆయకట్టు మొత్తానికి నీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా గిద్దలూరు నియోజకవర్గం లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందబోతుందని వివరించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు లేకుండా 11/33 కేవి విద్యుత్ సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములను ఆ గ్రామం వారికే పంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ అబూతలిం, మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## 'శక్తి యాప్' వినియోగం పై అవగాహన






(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 22)

చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో పట్టణంలోని ముంతావారి సెంటర్‌లో గల ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం విద్యార్థులకు మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డిఎస్పీ ఎండి మోయిన్, వన్‌టౌన్ ఎస్ఐ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శక్తి బృందం సభ్యులు హైస్కూల్ విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా 'శక్తి యాప్' వినియోగంపై అవగాహన కల్పిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు ఇది తక్షణ సహాయం అందించే సాధనమని తెలిపారు. ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాల నియంత్రణలో యాప్ పాత్రను వివరించిన అధికారులు, విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలియజేశారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల నేపథ్యంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల్లో అపరిచిత లింక్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సమస్యల సందర్భంలో 112, 181, 1091, 1098 హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## పంట వ్యర్థాలను కాల్చవద్దు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 21)

పంట వ్యర్థాలను (మొక్కజొన్న, ఇతర వ్యర్థాలు) కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది కాబట్టి రైతులు పంట వ్యర్థాలను కాల్చవద్దని మండల వ్యవసాయ శాఖధికారి చంద్రశేఖర్ సూచించారు. ఈ సందర్భంగా ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో సాగుచేసిన మొక్కజొన్న కోతలు పూర్తియిన అనంతరం వ్యర్థాలను కాల్చడం వలన నేల సారం తగ్గడంతో పాటు పర్యావరణ కాలుష్యంతోపాటు భూమిలో ఉండే సహజ సిద్ధమైన తేమ, కర్బన శాతం కోల్పోవడం, నేలలోని నత్రజని, భాస్వరం, పొటాషియం, ఇతర సూక్ష్మ పోషకాలు అగ్నికి ఆహుతై నేల సారాన్ని కోల్పోతుందన్నారు. అలాగే నేలలో ఉండే రైతుకు మేలు చేసే సూక్ష్మజీవులు కూడా వేడికి చనిపోతాయిని పంట వ్యర్థాల నుండి వెలువడే పొగ వల్ల గాలి నాణ్యత తగ్గడంతో పాటు హానికరమైన వాయువులు వాతావరణంలోకి విడుదల అవడం వలన శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తుతాయి అని అన్నారు. రైతు సోదరులరూ మొక్కజొన్న, ఇతర పంటల వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నలని రైతులకు ఏవో సూచించారు.

## ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు

### ఎస్ఐ శివరామయ్య

(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఏప్రిల్ 21)

మండలంలోని అన్ని గ్రామాల్లో సబ్ ఇన్స్పెక్టర్ శివరామయ్య ఆధ్వర్యంలో ముఖ్యమైన అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఉన్న ప్రదేశాలలో దొంగతనాలు జరగకుండా, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు దేవాలయ కమిటీలతో, పూజారులతో, పాస్టర్లతో మాట్లాడి అన్ని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాచ్ మెన్ ఖచ్చితంగా ఉండే విధంగా చూసుకోవాలని దేవాలయాల యాజమాన్యాలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పై మంత్రి గొట్టిపాటికి వివరించిన విద్యుత్ ఉద్యోగులు





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 21)

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని 1104 యూనియన్ రాష్ట్ర కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలుసుకుని విద్యుత్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి 01-04-2026 నుండి వేతన సవరణ అమలు చేయడం, 01-02-1999 నుండి 31-08-2004 మధ్య నియమించబడిన ఉద్యోగులకు, జీపీఎఫ్, పాత పెన్షన్ విధానం అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయడం, జేఎల్ఎం-2సమస్యల సత్వర పరిష్కారం, వ్యా సర్వీసును పెన్షన్ సర్వీసుగా పరిగణలోకి తీసుకోవడం, పొరుగు సేవల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం చెల్లించడం మొదలైన ప్రధాన సమస్యలపై సవివరంగా చర్చించబడింది. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, రాబోయే వారంలో జరిగే ఇందన శాఖ సమీక్షా సమావేశంలో చర్చించి సానుకూల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి. దేవేంద్ర రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. సంజీవరావు, జనరల్ సెక్రటరీ గణపతి వి.ఎస్.ఆర్.కె, అదనపు జనరల్ సెక్రటరీలు అన్నే శ్రీనివాసరావు, వై. మల్లేశ్వర రెడ్డితో పాటు ఇతర యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బూర్జువా కళలకు ప్రత్యామ్నాయంగా ప్రజా కళలు నిలవాలి



ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి ప్రజా కళలే
పాటకు, మంచి సాహిత్యం ఊపిరి పోస్తుంది
1000 మెదడులను ఆలోచింపజేసే
శక్తి పాటకు ఉంది
పాలకుల మోసాలను గుట్టు రట్టు
చేసేందుకు ప్రజా కళాకారులు నడుం బిగించాలి
ప్రజలను చైతన్యపరిచి ప్రజా ఉద్యమాలు వైపు
నడిపించాల్సిన బాధ్యత ప్రజా కళాకారుల పైన ఉంది
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు
ఒంగోలులో ఘనంగా ప్రారంభమైన
ఏపీ ప్రజానాట్యమండలి కోస్తా జిల్లాల సమావేశాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

నేడు యువతను, విద్యార్థులను పెడ ద్రోవ పట్టిస్తున్న బూర్జువా కళలకు ప్రత్యామ్నాయంగా ప్రజా కళలు నిలవాలని, అందుకు ప్రతి ప్రజా కళాకారుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కళారూపాలతో ముందుకు వచ్చి, పాలకుల గుట్టులను రట్టు చేస్తూ , ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా ఉద్యమాల వైపు నడిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏపీ ప్రజానాట్యమండలి కోస్తా జిల్లాల సమావేశాలు మంగళవారం మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ రామకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య పరిచేందుకు కదం తొక్కి నడవాల్సిన సమయం వచ్చిందన్నారు. దేశంలో పాలకులు దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా కళాకారులు కథను తొక్కాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కళలు చాలా శక్తివంతమైనవని, వాటి ద్వారా ప్రజలను మేలుకొల్పటానికి ప్రజా సాంస్కృతిక సంఘాలు సమైక్యంగా సమన్వయంతో నడవాల్సిన



అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో పాలకులు ప్రజలను అనునిత్యం మోసం చేసే పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారని, వాటిని ఎండ కట్టటానికి ఎప్పటికప్పుడు ప్రజా కళాకారులు నూతన రచనలతో, కొత్త పాటలతో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. సిపిఐ కార్యవర్గ సభ్యులు పి రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రజా కళాకారులు సంఘటితంగా పనిచేస్తే పాలకుల విధానాలను ఎండగట్టొచ్చు అన్నారు. ప్రజా కళాకారులు సంజీవి మాట్లాడుతూ ప్రజా కళాకారులు ప్రజలతో మమేకమవుతూ ప్రజా భాషలో కళారూపాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలికి దేశంలో రాష్ట్రంలో ప్రజలను మేల్కొల్పడంలో గొప్ప చారిత్రక నేపథ్యం ఉందన్నారు. గొప్ప కళారూపాలను తయారు చేసుకొని ప్రజలకు వద్దకు వెళ్లిన ఘనమైన చరిత్ర ప్రజానాట్య మండలి అన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి నూతన కళారూపాలు రూపొందించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ మతోన్మాద భావజాలాన్ని ప్రజల్లో నింపే ప్రయత్నాన్ని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళామండలి కోటి, ప్రకాశం జిల్లా సిపిఐ కార్యదర్శి ఆర్ వెంకట్రావు, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్ పిచ్చయ్య, ఎస్కే నజీర్, ఆర్ రామారావు, వివిధ జిల్లాల నుండి విచ్చేసిన అనేక మంది కళాకారులతో పాటు వివిధ సాంస్కృతిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా కిషోరి వికాశం






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా మంగళవారం ప్రకాశం భవనంలో ' కిషోరి వికాసం ' పేరుతో ప్రాంతీయ వర్క్ షాప్ ను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల నుండి అధికారులు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి మాట్లాడారు. కిషోర బాలబాలికల్లో లైఫ్ స్కిల్స్ నాయకత్వం, వారిలో వారికి నమ్మకం కల్పించడం, అలాగే ఈ సమ్మర్ హాలిడేస్ లో బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ లేకుండా చేయడం, ఈ బాలికలలో ఎడ్యుకేషన్ కొనసాగించడం, స్కూల్ డ్రాప్ అవుట్ తగ్గించడం, ఫిజికల్ యాక్టివిటీస్, వారిలో వారికి సృజనాత్మకత్వం పెంచడం ముఖ్య ఉద్దేశంగా వేసవి క్యాంపులను నిర్వహిస్తారు. ఈ హాలిడేస్‌లో సచివాలయం లెవల్‌లో బాలబాలికల పీర్ గ్రూప్ ఏర్పాటు చేసి వారిలో వారికి బృందం చర్చలు ఏర్పాటు చేసి ఒకరి సమస్యలుఅందరూ తెలుసుకొని వారిలో వారికి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేలాగే ఈ సమ్మర్ కిషోర్ వికాసం తోడ్పడుతుంది. హెల్త్ న్యూట్రిషన్, బాల్య వివాహాలు నిరోధించడం, జెండర్ ఈక్వటీ, చైల్డ్ రైట్ ప్రొటెక్షన్, డిజిటల్ సేఫ్టీ, నాయకత్వం అండ్ టీం వర్క్, ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్, కమ్యూనిటీ , టాలెంట్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, మహిళా శిశు సంక్షేమశాఖ ఆర్‌జెడి మనోరంజని, పీడీఐసీడీఎస్ నాగమణి, స్కూల్ ఎడ్యుకేషన్, మెడికల్, సెర్ప్, ఐసీడీఎస్, ఐసీపీఎస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిన వైసీపీ శ్రేణులపై కేసు నమోదు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)

ప్రకాశం జిల్లా ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో 20వ తేదీ వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి రాంబాబు కార్యక్రమం సందర్భంగా కొంత మంది యువకులు మోటార్ సైకిల్ ల పై పాత బైపాస్ రోడ్ లో వెంగముక్కలపాలెం జంక్షన్ వద్ద అక్రమంగా గుమి కూడి, రోడ్ పై మోటార్ సైకిల్ లను అడ్డం పెట్టి, ట్రాఫిక్ కి అంతరాయం కలిగించి, వచ్చే పొయ్యే వాహన చోదకులకు తీవ్ర అంతరాయం కలిగించారు. 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నప్పటికీ, అలా చేసిన వారిపై ఒంగోలు తాలుకాలో కేసు నమోదు చేశారు. మంగళవారం ఒంగోలు తాలుకా సీఐ టి విజయ కృష్ణ సదరు ఆకతాయిలను పోలీస్ స్టేషన్ లకు పిలిపించి, వారి మోటార్ సైకిల్ లను స్వాదీనం చేసుకొని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం అయినది. రానున్న వేసవి సెలవలను దృష్టిలో పెట్టుకొని, ఇంట్లో మైనర్ పిల్లలకు, లైసెన్స్ లేనివారికి వాహనాలను ఇవ్వవద్దు అని, అలా ఇవ్వడం చట్టపరంగా నేరం అని, ఏదన్న ప్రమాదం జరిగితే వాహన యజమాని లేదా తల్లిదండ్రులు కుడా భాద్యులు అవుతారు అని ఒంగోలు తాలుకా సీఐ టి విజయ కృష్ణ తెలియజేసారు. తల్లిదండ్రులు తమ పిల్లల మోటార్ సైకిల్ వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలి అని సీఐ తెలియజేసారు.

## అన్ని విధాలా అండగా ఉంటాం

ఒంగోలుకు ప్రతిష్టాత్మక ప్రాజెక్టు తెస్తున్నారు
కంది రవిశంకర్‌తో జాయింట్ కలెక్టర్
కల్పనా కుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన
రవిప్రియ హాస్పిటాలిటీస్ అధినేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

రవిప్రియ హాస్పిటాలిటీస్ అధినేత కంది రవిశంకర్ మంగళవారం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు నగర సమీపంలోని చదలవాడలో సుమారు రూ.100 కోట్ల నిర్మాణ వ్యయంతో 148 గదులతో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించేందుకు సంస్థ ముందుకు రాగా, రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ను రవిశంకర్ కలిసి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఆమెకు వివరించారు. ఈ హోటల్ నిర్మాణానికి సంబంధించి రవిప్రియ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలకు మార్చి 28న నిర్వహించిన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో అనుమతి లభించింది. పలు ప్రోత్సాహకాలు అందించాలని పర్యాటక శాఖకు సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో దీనికి రాష్ట్ర పర్యాటక విధానం 2024-29 కింద పలు రాయితీలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ హోటల్ నిర్మాణానికి మూలనిధి పెట్టుబడి, స్టాంప్ డ్యూటీ, విద్యుత్ ఛార్జీలు, తదితర అంశాల్లో ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఈ హోటల్‌లో 300 మందికి ఉపాధి కల్పించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆతిధ్య రంగంలో అతిపెద్దదైన రెండవ ప్రాజెక్టు ఒంగోలుకు తీసుకువస్తున్నట్లు జాయింట్ కలెక్టరుకు రవిశంకర్ చెప్పారు. దీనిపై ఆమె స్పందిస్తూ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ప్రాజెక్టు చేపట్టబోతున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరఫు నుంచి అవసరమైన సహాయ సహకారాలు వేగంగా అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# కోలాట కళా వైభవం... బద్వేల్ కళాకారుడు





**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 21)**

తెలుగువారి ప్రాచీన సంస్కృతికి ప్రతీక అయిన 'కోలాటం' కళలో తనదైన ముద్ర వేస్తూ, దశాబ్దాలుగా ఈ కళను కాపాడుతున్న బద్వేల్ ప్రాంత ప్రముఖ కోలాట కళాకారుడు వల్లేరవారి పల్లె గ్రామానికి చెందిన రామనబోయిన వెంకటేశ్వర్లు (వెంకీ) కి అరుదైన గౌరవం దక్కింది. వారి అద్భుతమైన నైపుణ్యాన్ని గుర్తిస్తూ, బద్వేల్ నియోజకవర్గ స్థాయిలో 'బెస్ట్ నంది అవార్డు'తో ఘనంగా సత్కరించారు. బాబు మోహన్ చేతుల మీదుగా పురస్కార ప్రధానం హైదరాబాద్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మంత్రి, ప్రముఖ సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. కోలాటం వంటి సాంప్రదాయ కళను మరుగున పడకుండా కాపాడుతున్నందుకు గాను ఈ గౌరవాన్ని అందించారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ కోలాటంలో ఉన్న లయ, క్రమశిక్షణ చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, బద్వేల్ ప్రాంతం నుండి ఇలాంటి గొప్ప కళాకారులు రావడం గర్వకారణమని ప్రశంసించారు.

## రామణ బోయిన వెంకటేశ్వర్లుకు 'నంది' పురస్కారం
## నంది అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం



**తిరుమల మాడ వీధుల్లో కోలాట సేవ :**

ఇటీవల తిరుమల శ్రీవారి సన్నిధిలో వెంకటేశ్వర్లు కోలాటం మాస్టర్ తమ బృందంతో కలిసి ఆయన ప్రదర్శించిన కోలాటం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ, ఇతర పవిత్ర దినాల్లో మాడ వీధుల్లో లయబద్ధంగా చేసిన కోలాట ప్రదర్శన, భక్తి భావాన్ని చాటిచెప్పడమే కాకుండా బద్వేల్ ప్రాంత కీర్తిని తిరుమల గిరిపై చాటిచెప్పింది.

**కళే శ్వాసగా.. కోలాటమే బాటగా**
**రామనుబోయిన వెంకటేశ్వర్లు (వెంకీ)**

అనేక సంవత్సరాలుగా ఎంతో మంది యువతకు కోలాటంలో శిక్షణ ఇస్తూ, ఈ కళ అంతరించిపోకుండా ఆయన కృషి చేస్తున్నారు. కోలాటంలోని విన్యాసాలను, తాళాలను ఎంతో నిశితంగా అభ్యసించి, వందలాది ప్రదర్శనల ద్వారా ప్రజల మన్ననలు పొందారు. ఆయనకు నంది అవార్డు రావడం పట్ల బద్వేల్ నియోజకవర్గ ప్రజలు, కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలువురు నాయకులు ప్రముఖులు వారి శిష్యులు అనేకమంది అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లును శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి వారికి అభినందనలు



తెలిపారు.

**నంది అవార్డు గ్రహీతకు ఘన సన్మానం :**

ఇటీవల హైదరాబాదులో మాజీ ఎంపీ సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా నంది అవార్డు తీసుకున్న రామణ బోయిన వెంకటేశ్వర్లు ను మంగళవారం సాయంత్రం జాంబవంత నగర్ కు చెందిన శ్రీ కోదండరామ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు వార్త జర్నలిస్ట్ వల్లం కొండు వెంకటరమణ, సి వి నాగేశ్వరరావు, కాలువ నాగేంద్రబాబు, హరి, శ్రీనివాసులు, సుబ్బయ్యతో పాటు పలువురు శాలువాతో సత్కరించి వారి సేవలను అభినందించారు. రామనుబోయిన వెంకటేశ్వర్లు అనేక సంవత్సరాలుగా బద్వేల్ ప్రాంతంలో కోలాటం నిర్వహిస్తూ అనేకమందికి కోలాటం నేర్పించి తమ కీర్తిని చాటుకోవడం అభినందనీయమన్నారు. భారతదేశంలో ప్రాచీన సాంస్కృతితో కలలు నేడు ఆధునిక కంప్యూటరికరణ యుగంలో అంతరిస్తున్న నేపథ్యంలో వెంకటేశ్వర్లు లాంటి కళాకారులు ప్రాచీన సాంస్కృతిక కళలను జీవం పోస్తూ యువత మహిళలకు కోలాటం, చెక్క భజన లాంటి కళలను నేర్పిస్తూ తమ ప్రదర్శనల ద్వారా భారతదేశ ప్రాచీన సాంస్కృతిక కళలను జీవం పోస్తూ ఉత్తమ కోలాటం గురువుగా నంది అవార్డు పొందడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. రానున్న కాలంలో మరెన్నో విశిష్టత అవార్డులు రాష్ట్రస్థాయిలో అలంకరించి గొప్ప ఖ్యాతి గడించాలని వారి సేవలను పలువురు కొనియాడుతూ శాలువాతో సత్కరించి

## బైపిసిలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన తాహిరా ఫాతిమాకు సత్కారం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 21)**

ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసిలో పొదిలి శ్రీ వివేకానంద కళాశాల విద్యార్థిని తాహిరా ఫాతిమా స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను రిటైర్డ్ జిల్లా జడ్జి, విద్యుత్ అదాలత్ చైర్మన్ ఎన్ విక్టరీ ఇమాన్యుల్, పొదిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ కిషోర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ షబ్బీర్, న్యాయవాది ముల్లా ఖాదర్‌వలి వారితో పాటు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అల్లినగరం గ్రామంలో బడి పిలుస్తుంది కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 21)**

కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అల్లినగరం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది బడి పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. పాఠశాల హెడ్మాస్టర్ యం. పద్మజ ఆదేశాల మేరకు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఆధ్వర్యంలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం చేశారు. డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, ఐఎఫ్పీ ప్యానల్ ద్వారా విద్యాబోధన జరుగుతుందని , ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు మంచి సదుపాయాలు అందుతాయని, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పనిచేస్తున్నాయని, పరీక్ష ఫలితాల్లో కూడా ఆశించిన ఫలితాలు లభిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అల్లినగరం, పామూరు పల్లె గ్రామాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించి 10 మంది విద్యార్థులను చేర్పించారు. ఈ కార్యక్రమంలో బి జనార్ధనరాజు, యం హరికుమార్ చౌదరి, వి శివరాం, ఎస్ చంద్రమోహన్, యం కృష్ణమూర్తి, యు శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, సురేంద్ర, ఓబయ్య పాల్గొన్నారు.







## మే 4న కృష్ణా జలాల పై మార్కాపురంలో వైఎస్సార్సీపీ సదస్సు

### సదస్సు నిర్వహణ పై బూచేపల్లి, అన్నా సన్నాహక సమావేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 21)**

రాయలసీమ జిల్లాలు, పూర్వపు రాయలసీమలో అంతర్భాగమైన మార్కాపురం జిల్లా ప్రాంతపు రైతాంగం, ప్రజల అవసరాలు, ప్రయోజనాల దృష్ట్యా కృష్ణా జలాల వినియోగ ఆవశ్యకత పై, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాల పురోగతి పై సమగ్రంగా చర్చించేందుకు వైఎస్సార్సీపీ నడుం బిగించింది. విస్తృత స్థాయిలో మే నెల 4వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సుకు వేదికగా మార్కాపురం జిల్లా కేంద్రంలోని "సౌజన్య ఫంక్షన్ హాల్" ను నిర్ణయించారు. రాష్ట్ర స్థాయిలో నాయకులు, మేధావులు, నిపుణులు, రైతు నాయకులు పాల్గొననున్న ఈ సదస్సును విజవంతం చేసేందుకు ప్రకాశం, మార్కాపురం ఉమ్మడి జిల్లాల వైఎస్సార్సీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత వర ప్రదాయని వెలుగొండ ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా చేయాల్సి వుందని వారన్నారు. పూర్తి కరవు పీడిత ప్రాంతాల కోసం నిర్దేశించిన వెలుగొండ ప్రాజెక్ట్ రాయలసీమ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకం సాగకపోతే రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతాంగానికి అన్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఇంఛార్జిలు, మేధావులు, నిపుణులు, నాయకులు పాల్గొంటున్నారు. ఈ సదస్సు విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులను, క్రియాశీలక కార్యకర్తలను సన్నాహపరిచారు.

## జేఎంబి చర్చ్ వర్గ పోరుకు తెర

### సంఘ కాపరిగా ఆగస్టీన్ కు పూర్తి బాధ్యతలు ఇచ్చిన కోర్టు
### చర్చిలో ఆగస్టీన్ వర్గీయుల సంబరాలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

స్థానిక జేఎంబి చర్చిలో వర్గ పోరుకు తెర పడింది. సంఘ కాపరిగా ఆగస్టీన్ కు పూర్తి బాధ్యతలు జిల్లా కోర్టు అప్పగించింది. 2017లో ఆగస్టీన్ కు వ్యతిరేకంగా పాస్టర్ జాన్ కెనడి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు తీర్పు వచ్చేవరకు పాస్టర్ ఆగస్టీన్ పులిపీ ఎక్కు వద్దని, ఆదివారాలు ప్రార్థనలను నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేసింది. అప్పటినుండి పాస్టర్ ఆగస్టీన్, పాస్టర్ జాన్ కెనడి వర్గాలుగా విడిపోయి ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అయితే కోర్టు పాస్టర్ ఆగస్టీన్ అనుకూలంగా తీర్పునిచ్చింది. వారంలో అన్ని రోజులు పాస్టర్ ఆగస్టీన్ పులిపీట్ ఎక్కి ప్రాంతంలో నిర్వహించవచ్చని పేర్కొంది. దీంతో జే ఎం బి చర్చిలో పాస్టర్ ఆగస్టీన్ వర్గీయులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆగస్టీన్, చర్చి సెక్రెటరీ జాన్ ఆశీర్వాదం, సంఘ పాలకులు పాల్, రేజలమ్మ మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ వచ్చి వర్గ భేదాలు లేకుండా చర్చిలో ప్రార్థనలో పాల్గొని, ప్రభువు ఆశీస్సులు పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో భక్తుల సంబరాలు అంబరాన్నంటాయి.

## అంబటి రాంబాబును కలిసిన వైసీపీ నాయకులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)**

ఒంగోలులోని జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీసులో మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రాంబాబుని కందుకూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో రాష్ట్ర వైఎస్ఆర్సిపి సంయుక్త కార్యదర్శి వెలిచర్ల ధనకోటి, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు సన్నిబోయిన సుధాకర్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 21)**

మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి స్వాముల ఆరాధనలో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన అగ్ని గుండా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది. కణకణ మండే నిప్పుల గుండం నుంచి జై వీరబ్రహ్మేంద్రస్వామికి జై, ఓంనమః శివాయ అంటూ భక్తులు నిప్పుల గుండం నుంచి నడిచేందుకు పోటీ పడ్డారు. అగ్ని గుండా కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి అందరూ బాగుండాలని, పంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండం కార్యక్రమం సందర్భంగా కమిటీ వారు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమలు, నాట్య విన్యాసాలు, ఆట పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కె సుబ్బారెడ్డి, వెంకటనారయణ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## నాగరాజుకు నివాళులర్పించిన ఎరిక్షన్ బాబు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 21)**

యర్రగొండపాలెం మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన కరెంట్ షాక్ తగిలి మేకల నాగరాజు అకాల మరణ వార్త తెలుసుకుని యర్రగొండపాలెం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు వారి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుడి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.

# గంజాయి వంటి మాదకద్రవ్యాలు, నేరాలు నియంత్రణే లక్ష్యం

## ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా కార్డన్ సెర్చ్

## కార్డన్ సెర్చ్‌లో 34 మోటార్ సైకిళ్ళు, ఒక ఆటో, ఒక కారు స్వాధీనం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

మాదక ద్రవ్యాల నిర్మూలనే, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో వివిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సీ కాలనీ , పరిసర ప్రాంతంలో విస్తృత స్థాయిలో ఆపరేషన్ వజ్రా ప్రహార్‌లో భాగంగా కార్డన్, సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, కందుకూరి సిఐ అన్వర్ బాషా, వివిపాలెం ఎస్ఐ మరిది నాయుడు, కందుకూరు టౌన్ ఎస్ఐ నాగరాజు, కందుకూరు రూరల్ ఎస్ఐ



బాలకృష్ణ, లింగసముద్రం ఎస్ఐ రాంబాబు, పొన్నలూరు సత్యనారాయణ, 30 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ పరికరాల ద్వారా అనుమానితుల తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా గంజాయి ,ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లు, దుకాణాలు, గంజాయి కేసుల్లోని పాత ముద్దాయిల ఇళ్లు , ఇతర ప్రదేశాలను సోదాలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 34 మోటార్ సైకిల్, ఒక ఆటో మరియు ఒక కారు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాహన యజమానులకు చలానాలు విధించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు మరియు వాటి శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో స్థానిక ప్రజలతో కలిసి గంజాయికి



వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని "గంజాయిని పారదోలుదాం- డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడుదాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి పాల్పడిన, ఎవరైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత వాహనాలు కొనుకోలు చేసే ముందు అన్ని డాక్యుమెంట్ లు సరిగా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు.

# పేదల ప్రాణాలకు అండగా సీఎం సహాయ నిధి

### ఎమ్మెల్యే ఏలూరి చొరవతో అత్యవసర వైద్యానికి ఎల్ఓసీలు

### రెండు కుటుంబాలకు రూ.9 లక్షల చెక్కులు

### ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలుపుతున్న కుటుంబాలు





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఏప్రిల్ 21)

పేదరికం ఒకవైపు... ప్రాణాపాయం మరోవైపు.. ఇలాంటి క్లిష్ట సమయంలో ఆశగా నిలిచింది ఎమ్మెల్యే ఏలూరి కృషి పర్చూరు నియోజకవర్గంలో క్యాన్సర్‌తో పోరాడుతున్న మహిళకు రూ.6 లక్షలు, ప్రీమేచ్యూర్‌గా పుట్టిన శిశువు వైద్యానికి రూ.3.02 లక్షలు అత్యవసర వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భారీ మొత్తంలో చెక్కులను మంజూరు చేయించి సీఎం నిధి ద్వారా మంజూరు చేయించి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కుటుంబాలకు అండగా నిలిచారు. అత్యవసర వేళ అందిన ఈ సహాయం రెండు కుటుంబాలలో వెలుగులు నింపింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో తక్షణ సహాయం అందుతోంది. మంగళవారం రెండు కుటుంబాలకు అందించిన సహాయం మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోంది.

**క్యాన్సర్ బాధితురాలికి రూ.6 లక్షల సాయం...** కారంచేడు గ్రామానికి చెందిన పోకూరి పద్మావతి (55) గత కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు గుంటూరులోని ఒమేగా ఆసుపత్రికి తీసుకెళ్లగా, వ్యాధి తీవ్రస్థాయికి చేరి లివర్ వరకు వ్యాపించిందని వైద్యులు నిర్ధారించారు. కీమోథెరపీతో పాటు మెరుగైన చికిత్స అవసరమని సూచించారు. భర్త లేని ఆమెకు ఆర్థిక పరిస్థితులు చికిత్సకు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా రూ.6 లక్షలు మంజూరు చేయించారు.ఆ చెక్కును తెలుగుదేశం పార్టీ నేతలు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు అందజేశారు.

**ప్రీమేచ్యూర్ బాబుకు అత్యవసర వైద్యం...**వంకాయలపాడు గ్రామానికి చెందిన మన్నెం సుభాషిని ఇటీవల చిలకలూరిపేటలోని వరలక్ష్మి ఆసుపత్రిలో బాబుకు జన్మనిచ్చారు. నెలలు నిండక ముందే పుట్టిన బాబు బలహీనంగా ఉండటంతో ప్రత్యేక వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. రోజువారీ కూలీగా పని చేసే భర్త ప్రశాంత్‌కు వైద్య ఖర్చులు భారంగా మారాయి. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ఆశ్రయించగా, పరిస్థితి అత్యవసరమని గుర్తించిన ఆయన ఒక్క రోజులోనే సీఎం రక్షణ నిధి నుంచి రూ.3,02,598 మంజూరు చేయించి చెక్కును అందజేశారు.

**ఎల్ఓసీలతో పేదలకు ఊరట...**ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సుతో అందుతున్న ఎల్ఓసీలు పేదలకు అత్యాధునిక వైద్యం అందేలా చేస్తున్నాయని నేతలు అభిప్రాయపడుతున్నారు. అత్యవసర సమయాల్లో అందుతున్న ఈ సహాయం పేద కుటుంబాలకు ఊరటనిస్తూ ప్రాణాలను కాపాడుతోందని నేతలు పేర్కొంటున్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సిబ్బంది పై చర్యలు

### వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి

### పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ద చూపాలి

### జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 22)

వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపాటు పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ద చూపాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు స్పష్టం చేసారు. మంగళవారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు జిజిహెచ్‌ను సందర్శించి, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సుపరింటెండెంట్, సెక్యూరిటీ, శానిటేషన్, ప్లంబర్, ఎలక్ట్రిషియన్ ఏజెన్సీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశమై ఆయా విభాగాల పనితీరును సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులతోపాటు పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. ఆయా విభాగాల విదులపట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసారు. విధుల నిర్వహణలో షిఫ్ట్ డ్యూటీ టైమింగ్స్ ను ఖచ్చితం పాటించాలని, ప్రతి విభాగంలో సిబ్బంది విధుల పట్ల ప్రత్యేక నిఘా ఉంటుందని, టైమింగ్స్ పాటించని, విధుల పట్ల అలసత్వం వహించిన సిబ్బంది పట్ల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి ఆవరణలోకి కుక్కలు, పశువులు, రాకుండా సెక్యూరిటీ సిబ్బంది పటిష్టంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ద చూపాలని, ఎప్పుడు ఆసుపత్రి లోపల, ఆవరణలో క్లీన్‌గా ఉండేలా సంబంధిత పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సుపరింటిండెంట్ డాక్టర్ మాణిక్యరావు, సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ మాధవిలత, పరిపాలనాధికారి అద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపూడిలో భూముల రి సర్వే ప్రారంభం

## తహసీల్దార్ జనార్ధన్ వెల్లడి



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 21)

మండల కేంద్రమైన మర్రిపూడి గ్రామపంచాయతీ పరిధిలో భూముల రీ సర్వే ప్రారంభించడం జరిగిందని తాసిల్దార్ జనార్ధన్ అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయంలో జరిగిన రీ సర్వే సమావేశంలో ఆయన రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ సర్వే జరిగే సమయంలో ప్రతి రైతుకు సమాచారం అందిస్తామని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు రైతు ఉపయోగించుకొని మీ భూములను సర్వే చేయించుకోవాలని రైతులను కోరారు. మండల సర్వేయర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ రీసర్వే కు నాలుగు టీములు నియమించడం జరిగిందని సర్వే నెంబర్లు వారిగా టీములన్ని ప్రతి రోజు అందుబాటులో ఉండి సర్వే చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. సర్వే నంబర్లు వారీగా ఆయా రైతులకు సమాచారం అందించి భూములకు హద్దులను నూటికి నూరు శాతం చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బడే సాహెబ్, సచివాలయం సర్వేయర్, మాజీ జెడ్పిటిసి సభ్యులు తుళ్లూరి నరసింహారావు, శాంతి ఆంధ్ర పత్రిక ఎడిటర్ గురిజాల బాబురావు, టిడిపి సీనియర్ నాయకులు సారెడ్డి పుల్లారెడ్డి, చేరెడ్డి చెంచిరెడ్డి, రమణారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


## విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ తొండెపు బుచ్చయ్యకి విప్లవ జోహార్లు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, జిల్లాలో జరిగిన అనేక రైతాంగ ఉద్యమాల్లో పాల్గొని, తన జీవించిన చివర వరకు ఆదర్శ, విప్లవ కమ్యూనిస్టుగా బతికిన కామ్రేడ్ తొండెపు బుచ్చయ్య ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తామని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కామ్రేడ్ తొండేపు బుచ్చయ్య 5 వ సందర్భంగా ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్లో ఘనంగా నిలవాలని అర్పించారు. ఈ కార్యక్రమంలో చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ బుచ్చయ్య జిల్లాల్లో జరిగిన అనేక రైతాంగ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నవారని అన్నారు. 1996 మోపాడు రిజర్వాయర్ కి వరద వచ్చి వందలాది మంది రైతులు చనిపోయినప్పుడు వారికి అండగా నిలబడ్డారన్నారు. దేవరంపాడు, ఉలిచి తదితర ప్రాంతాల్లో ఉప్పు రైతులకి మద్దతుగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. ఒంగోలు నగరం కేంద్రంగా అనేక ఉద్యమాల్లో పాల్గొని, ఆదర్శ విప్లవ కమ్యూనిస్టుగా చివర వరకు జీవించారాని ఆ కామ్రేడ్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తామని చిట్టిపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కార్యదర్శి పద్మ, అరుణోదయ జాలన్న, పిడిఎస్ యూ రాజశేఖర్, రామ్మోహన్, దారా సుబ్బారావు, అమ్మాజీ, రామకృష్ణ, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపర దమయంతి భౌతిక ఖాయానికి నివాళులు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 22)

చిన్నగంజాం మండల మాజీ ఎంపీపీ, తెదేపా మాజీ మండల అధ్యక్షుడు, గ్రామీణ వైద్యులు డాక్టర్ కొల్లిపర కృష్ణమూర్తి సతీమణి కొల్లిపర దమయంతి సోమవారం అనారోగ్య కారణాల వలన మృతిచెందారు. విషయం తెలుసుకున్న మండల తెదేపా అధ్యక్షుడు పొద వీరయ్య చౌదరి, అబ్దుల్ కలాం అజాద్, నరహరి శ్రీనివాసరావులు ఆమె పార్థివ దేహానికి పూలమాల సమర్పించి ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి సంతాపం తెలియజేశారు. వారి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# పండ్ల తోటలకు నష్టం కలిగించేలా

# హై టెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే

**ఇండోసోల్ అరాచకమా?**

**పచ్చనోటు ప్రభావమా?**

**సీఎం చంద్రబాబుకు బీసీ నేత జయరాం ఫిర్యాదు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

పండ్ల తోటలకు నష్టం కలిగించే హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్పించాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోటికలపూడి జయరాం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. కందుకూరు నుండి కరేడు లోని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు కొద్ది నెలల క్రితం సర్వే జరిగింది. సాధారణంగా ఒక వంతెన గాని, రోడ్డు గాని, కరెంట్ లైన్ గాని, టెలిఫోన్ లైన్ గాని నిర్మించేటప్పుడు వ్యయ, ప్రయాసలను తగ్గించే తక్కువ దూరాన్ని ఎంపిక చేస్తుంటారు. అయితే ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం కందుకూరు నుండి కరేడుకు వేస్తున్న 220ఎజ హై టెన్షన్ విద్యుత్తు లైను అలైన్మెంట్ నిబంధనలకు విరుద్ధంగా దిశను మార్చుకుంది. కందుకూరు నుండి కరేడుకు వేస్తున్న 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ మన్నేటికోట శివాలయం వద్ద మన్నేరు దాటి తూర్పుకు వచ్చింది. ఇక్కడి నుంచి ఈ లైన్ తూర్పుగా వెళ్లి, చిల్లా కాలువ సమీపంలో జాతీయ రహదారిని దాటి కర్రేడు పంచాయతీలోకి ప్రవేశిస్తుంది. శివాలయం సమీపంలో మ్యానర్ దాటిన విద్యుత్ లైన్ మార్గాన్ని గ్రామానికి దక్షిణ దిశలో ప్రతిపాదించారు. అయితే ఈ విద్యుత్తు లైను కోసం సర్వేయర్లు ప్రతిపాదించిన మార్గం 33 వ పోల్ దగ్గరికి వచ్చేసరికి, దిశను మార్చుకుంది. చిల్లా కాలువ బ్రిడ్జికి 1.5 కిలోమీటర్ల దూరంలో, బడితల రమణయ్య పొలం నుండి నేరుగా అంటే తూర్పుగా చిల్ల కాలువ వైపు వెళ్లాల్సిన విద్యుత్ లైన్ను సర్వేయర్లు 90 డిగ్రీల కోణంలో ఉత్తర దిశకు మళ్లిస్తూ అలైన్మెంట్ మార్చినారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ అలైన్మెంట్ మార్చడం వల్ల పండ్ల తోటలకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఇవన్నీ కూడా బీసీ కులాలకు చెందిన చిన్న, సన్న కారు రైతుల భూములు. పడమర నుంచి వచ్చే లైను నేరుగా తూర్పుకు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, 33 వ పోల్ నుండి ఉత్తర



దిశ తీసుకొని, జాజుల చార్వాక మామిడి తోట, ఆత్మకూరు పుల్లయ్యల మాగాణి మీదుగా కొంచెం దూరం వెళ్లి, అక్కడ ఇంకో వంకర తిరిగి దక్షిణ దిశగా కొంత దూరం వచ్చాక, అక్కడ ఇంకో వంకర తిరిగి తూర్పుకు వెళ్ళునట్టుగా ప్రతిపాదించారు.

33 వ పోల్ నుండి చిల్లా కాలువ వరకూ తక్కువ ఖర్చుతో, రైతులకు తక్కువ నష్టంతో విద్యుత్ లైన్ నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ, సర్వేయర్లు నిబంధనలు పాటించలేదు. పచ్చ నోట్ల ప్రభావమో, ఇండోసోల్ సోలార్ సిబ్బంది అరాచకమో గాని, అలైన్మెంట్ తప్పుగా మార్చడం వల్ల బీసీ రైతులు నష్టపోతున్నారని పోటికలపూడి జయరాం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 33వ పోల్ నుండి హై టెన్షన్ విద్యుత్ లైన్ను నేరుగా తీసుకువెళితే, విద్యుత్తు లైను మూడు వంకర్లు తిరగాల్సిన పనిలేదని, పండ్ల తోటలకు నష్టం జరిగే అవకాశం ఉండదని పోటికలపూడి జయరాం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తెలియజేశారు. జాజుల చార్వాక మామిడి తోట గుండా వెళ్లేందుకు ప్రతిపాదించిన విద్యుత్ లైన్ను, యధాతధంగా ఏర్పాటు చేస్తే, చార్వాక తోటలోని 400 మామిడి చెట్లది జీవన్మరణ సమస్య అన్నారు. హై టెన్షన్ విద్యుత్ వైర్లగుండా వచ్చే వైబ్రేషన్స్కు ఫలదీకరణ కూడా జరిగే అవకాశం లేదన్నారు. పూత కూడా రాదన్నారు. పక్కనే ఉన్న సపోటా తోటకు ఇలాంటి సమస్య ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. కందుకూరు నుండి కరేడులోని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం నిర్మించ తలపెట్టిన 220 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కోసం ప్రతిపాదించిన అలైన్మెంట్ను పునః పరిశీలన జరిపించాలని, రైతులకు తక్కువ నష్టం జరిగే మార్గాన్ని ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని పోటికలపూడి జయరాం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కోరారు.

## సాత్తూర్‌లో ఎన్డీఏ ప్రచారం విజయవంతం

**సీఎం చంద్రబాబు సభలకు కిక్కిరిసిన జనం**

**ఎమ్మెల్యే ఏలూరి, ఎంపీ కలిశెట్టి కృషికి నేతల ప్రశంసలు**



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 22)

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ తరపున సీఎం చంద్రబాబు నిర్వహించిన ప్రచార కార్యక్రమాలు సాత్తూర్ నియోజకవర్గంలో విజయవంతం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న సభ, ర్యాలీలు, ప్రచార కార్యక్రమం ప్రజలను భారీగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎన్డీఏ పాలనతోనే అభివృద్ధి సాధ్యం" అని పేర్కొన్నారు. 2019--24 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విధ్వంసాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కేంద్ర సహకారంతో రాష్ట్ర పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. అలాగే గత ఐదేళ్లుగా చెన్నై సహా తమిళనాడులో అభివృద్ధి శూన్యంగా మారిందని విమర్శించారు. ఎన్డీఏ అభ్యర్థులను గెలిపిస్తే తమిళ ప్రజల అభివృద్ధికి దోహదం అవుతుందని ఆయన పిలుపునిచ్చారు. సాత్తూర్‌లో వివిధ సామాజిక వర్గాల నాయకులు, కార్యకర్తలతో సీఎం సమావేశమై, అనంతరం జరిగిన భారీ ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విశేష కృషి చేశారు. స్థానిక స్థాయిలో సమన్వయం, భారీ జనసమీకరణ, కార్యక్రమాల సమర్థ నిర్వహణలో వారి పాత్ర కీలకంగా నిలిచింది. వివిధ వర్గాల నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఎన్డీఏకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో వారు ముందుండి నడిపించారు. ప్రచార కార్యక్రమం విజయవంతం కావడంతో ఎన్డీఏ నేతలు ఎమ్మెల్యే ఏలూరి, ఎంపీ కలిశెట్టిని ఘనంగా సన్మానించారు. వారి కృషిని ప్రశంసిస్తూ, ఎన్నికల విజయానికి ఇది మంచి సంకేతమని నేతలు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే , ఎంపీపై నేతలు ప్రశంసల జల్లు కురిపించారు.

## ఘనంగా ఆదిశంకరాచార్య శంకర జయంతి ఉత్సవం

**ముఖ్య అతిథులుగా దేవాదయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి శ్రీగిరి రాజు నరసింహ బాబు**

**జాతీయ యువజన బ్రాహ్మణ కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్**

**సీఎస్‌పురం తహసీల్దార్ కేవీ ప్రసాద్**

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 21)





కనిగిరి కూనపులి అన్నపూర్ణమ్మ డాక్టర్ నరసింహారావుల కళ్యాణ్ సదన్‌లో ఆదివారం ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా అంగరంగ వైభవంగా శంకర జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు సర్రాజు సాయినాథ శర్మ, ఇందు శర్మ, గణపతి పూజ, మహాన్యాస రుద్రాభిషేకం స్వామి వారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జగర్లపూడి కమలమ్మ రామనాధ శర్మ స్మారక దర్మిక ట్రస్ట్ నిర్వాహకులు జెవి సూర్యనారాయణ సహకారంతో, కళ్యాణమండపం కమిటి, కొద్దిమంది బ్రాహ్మణ పెద్దల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మండపం చైర్మన్ ధూళిపాళ్ల వీరభద్రరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీగిరి రాజు, నరసింహ బాబు, జాతీయ యువజన బ్రాహ్మణ కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్, సిఎస్‌పురం తాసిల్దార్ కె వి ప్రసాద్‌రావు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది మాచవరం బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, బ్రాహ్మణ సంఘ బంధుమిత్రులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి పంచామృతం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కల్యాణ సదన్ చైర్మన్ దూళిపాళ్ళ వీర భద్రరావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, అగస్త్య రాజు హనుమంతరావు, కొండూరి సుబ్రహ్మణ్యం, సింగరాజు లక్ష్మి వెంకట నారాయణరావు, వేమూరి రామశాస్త్రి, కొండూరి మాధవశర్మ, పవని మురళీధర్‌రావు, గొట్టిపాల్ల రామస్వామి, ధూళిపాళ్ల రమణమూర్తి, రామచంద్రుని రవి, లోకా రమేష్ చంద్ర, సంగరాజు వెంకట కృష్ణమూర్తి, పొనుగోటి నారాయణరావు, శ్రీకంఠం నాగరాజశ్రీ, వాలిచల్ల అంబరీష్, కొండూరి కృష్ణమూర్తి, ధూళిపాళ్ళ వివేకానంద, బచ్చలి భాస్కర్, సింగంపల్లి చైతన్య, బచ్చలి రఘు, గణపవరపు రవి, సురభి అరుణ్ ప్రసాద్, రాచమల్ల వెంకటసుబ్బయ్య, మారెళ్ళ నాగరాజ్, జొన్నలగడ్డ శబరి, వాలిచల్ల సూర్య నారాయణ, ఆడిటర్ ప్రసాద్, సుసర్ల సుధాకర్, సింగరాజు రవీంద్రబాబు, వాలిచర్ల మధు సుదన్ రావు, పాజర్ల రవి, మంత్రి రమ సత్యనారాయణ, రామచంద్రుని వెంకటసుబ్బయ్య, మారెళ్ళ కృష్ణమూర్తి, రామచంద్రుని నాగేశ్వరరావు, ధూళిపాళ్ల ప్రసాదు ,గణపవరపు కిరణ్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణన పై శిక్షణ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 22)

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కార్యక్రమంలో భాగంగా చిన్నగంజాం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు రొండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె ప్రభాకర రావు, ఎఎస్ఓ శివ ప్రసాద్, శిక్షణ అధికారులు ఎన్ శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు పాల్గొని సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో 41 ఎన్యూమరేటర్లు, 5గురుసూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## వివోఏలకు చరవాణిలను అందజేసిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి










(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 21)

మార్కాపురం పట్టణంలోని ఎస్సి, బీసీ కాలనీలో ఉన్న డ్వాక్రా బజార్లో నియోజకవర్గంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన వివోఏలకు ప్రభుత్వం అందించిన చరవాణిలను మంగళవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం డ్వాక్రా వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఈ వ్యవస్థ లేకముందు మహిళలు ఎక్కువగా పొలం పనులు చేసే వారిన్నారు. కానీ ఇప్పుడు డ్వాక్రా వ్యవస్థతో మహిళలు స్వయం శక్తితో అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. విజన్ 2020 అని మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు టెక్నాలజీని ప్రజలకు పరిచయం చేసి ప్రజా జీవితాలలో నూతన వరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు విజన్ 2047తో మరింత మెరుగైన అభివృద్ధి సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు శాఖ అధికారులు, వివోఏలు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం

## టౌన్ టాపర్‌కు నగదు పురస్కారం

**ఇంటర్మీడియట్ టౌన్ ఫస్ట్ సాధించిన చక్రధర్‌ను సన్మానించిన డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, జీవీ సుబ్బారెడ్డి**



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 21)

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో బద్వేల్ పట్టణంలో ప్రథమ స్థానం సాధించిన గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థి రెడ్డివారి చక్రధర్ (988/1000)ను డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి, జీవి సుబ్బారెడ్డి ఇరువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయానికి కారకులైన గౌతమ్ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థి తల్లిదండ్రులు వెంకటరామయ్య, రంగలక్ష్మమ్మలను అభినందించారు. చక్రధర్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా జీ,వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్‌లో బద్వేల్ టౌన్ ఫస్ట్ టాపర్‌గా మంచి మార్కులు సాధించిన విద్యార్థి చక్రధర్‌కు ప్రోత్సాహంగా రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, చక్రధర్ తమ స్వగ్రామమైన బోవీళ్లవారి పల్లెకు చెందినవాడిగా ఉండటం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. చక్రధర్ ఉన్నత చదువులు బాగా చదివి మరిన్ని విజయాలు సాధించి మన ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నామన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని, మహాపురుషులవుతారని, నీ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం చిన్నారిని శాలువాతో సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.